క్లుప్తంగా

నూకాలమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు


అమ్మవారి దర్శనానికి వేచి ఉన్న భక్తులు


నూకాలమ్మ అమ్మవారు

పెద్దాపురం: కాండ్ర కోట నూకాలమ్మ అమ్మవారి దర్శనానికి నాలుగో ఆదివారం భక్తులు పోటెత్తారు. కొత్త అమావాస్య మాసం పురస్కరించుకుని సుమారు 45 రోజుల పాటు జాతర మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ గవరసాని వీరాస్వామి, ఆలయ ఈఓ తలాటం వెంకట సూర్యనారాయణల ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. సీఐ రవికుమార్ పర్యవేక్షణలో ఎస్సై వెలుగుల సురేష్ బందోబస్తు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించారు. స్వచ్ఛంద సంస్థల సభ్యులు యాత్రికులకు మజ్జిగ, పాలు పంపిణీ చేశారు.

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ


భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న ఈఓ

పెద్దాపురం: మరిడమ్మ అమ్మవారి ఆలయ సిబ్బంది సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఈఓ సీహెచ్‌వీ రామ్మోహనరావు అన్నారు. వేసవి ఎద్దడి నేపథ్యంలో ఆదివారం ఆలయం వద్ద దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. భక్తులకు ఈఓ మజ్జిగను పంపిణీ చేశారు.

పకడ్బందీగా పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్


పెద్దాపురంలో పోస్టల్ బ్యాలెట్‌ను పరిశీలిస్తున్న ఆర్‌ఓ సీతారామారావు

పెద్దాపురం: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రెండో రోజు ఆదివారం పెద్దాపురం నియోజకవర్గంలో నిర్వహించిన పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్ ప్రక్రియలు ప్రశాంతంగా ముగిశాయి. పెద్దాపురం ఎన్నికల రిటర్నింగ్ అధికారి జె.సీతారామారావు ఆధ్వర్యంలో ఉదయం 9 నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు స్థానిక లూథరన్ హైస్కూల్‌లో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ నిర్వహించారు. ఓటు హక్కు వినియోగించేందుకు నియోజకవర్గానికి చెందిన ఆయా శాఖల ఉద్యోగులు క్యూ కట్టారు, వారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆర్‌ఓ అన్ని చర్యలు తీసుకున్నారు. నిష్పక్షపాతంగా పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్ ప్రక్రియను నిర్వహించామని ఆర్డీఓ, ఆర్‌ఓ సీతారామారావు తెలిపారు.

ఐ బ్యాంక్‌కు రూ.లక్ష వితరణ


ఐబ్యాంక్‌కు విరాళం అందిస్తున్న దంపతులు

బాలాజీచెరువు: ఉభయ గోదావరి జిల్లాల్లో అంధులకు కంటిచూపు ప్రసాదిస్తున్న డాక్టర్ బాదం బాలకృష్ణ ఐ బ్యాంక్‌కు ఆదివారం డేగల వీరభద్రరావు, మహాలక్ష్మి దంపతులు రూ.లక్ష విరాళం అందజేశారు. ఐ బ్యాంక్ చైర్మన్ దామెర విజయలక్ష్మికి ఈ చెక్కు అందజేశారు. ఐ బ్యాంక్ సేవలను మరింత విస్తృతం చేయాలని కోరారు. ఐ బ్యాంక్ కార్యదర్శి డాక్టర్ బాదం బాలకృష్ణ మాట్లాడుతూ ఐ బ్యాంక్ ద్వారా 6,586 కార్నియాలు సేకరించామని చెప్పారు. అంధులకు ఆశా దీపంగా ఐ బ్యాంక్ నడుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఐ బ్యాంక్ ట్రస్టీలు, సిబ్బంది పాల్గొన్నారు.

సాయిధరమ్‌తేజ ర్యాలీలో వివాదం

పిఠాపురం: గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో ఆదివారం రాత్రి సినీ నటుడు సాయిధరమ్ తేజ ఎన్నికల ప్రచార ర్యాలీలో వివాదం చోటు చేసుకుంది. వివాదంలో తాటిపర్తికి చెందిన యువకుడు ఎస్. శ్రీధర్‌కు గాయాలయ్యాయి. కాగా అతనిని చికిత్స కోసం పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. తాటిపర్తిలో సాయిధరమ్ తేజ ఎన్నికల ప్రచార ర్యాలీ వెళుతుండగా కొందరు యువకులు పరస్పరం వాగ్వివాదానికి దిగారు. దీంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. దీంతో విషయం తెలుసుకున్న గొల్లప్రోలు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఇరు వర్గాలను చెదరగొట్టి ర్యాలీని పంపించివేశారు.

సచివాలయాలు.. సేవా నిలయాలు


యండపల్లి గ్రామ సచివాలయం

- ఇంటి వద్దకే సకల సేవలు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

కొత్తపల్లి: మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సాకారం చేసింది. ప్రతి రెండు వేల జనాభాకు ఒక సచివాలయం ఏర్పాటు చేసి సచివాలయాల్లో 10 నుంచి 12 శాఖల అధికారులను నియమించింది. ప్రజలకు వారి సొంత గ్రామాల్లోనే 536 రకాల ప్రభుత్వ సేవలను గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా అందుబాటులోకి తీసుకొచ్చింది. కుల, మత, ప్రాంత, రాజకీయాలతో సంబంధం లేకుండా అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలను అమలుచేస్తుంది. గ్రామ స్థాయిలో సచివాలయాలు ఏర్పాటు చేయడంతో మండల, జిల్లా కార్యాలయాల చుట్టూ తిరిగే అవస్థ ప్రజలకు లేకుండాపోయింది. అందుకే సచివాలయ వ్యవస్థపై ప్రజల నుంచి హర్షం వ్యక్తమవుతుంది.

ప్రజల వద్దకే పాలన

సచివాలయాల ఏర్పాటుతో ప్రజలకు ఏ అవసరం వచ్చినా వారి సొంత గ్రామాల్లోనే సేవలు అందుతున్నాయి. ముఖ్యంగా నవరత్నాలకు సంబంధించిన పింఛన్ల పంపిణీ, అందరికీ ఇళ్లు, చేదోడు, చేయూత, మ్యుటేషన్, ఇళ్ల నిర్మాణం, భూముల సర్వే, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, సీఎం కిసాన్ తదితర పథకాలను వలంటీర్ల ద్వారా నేరుగా లబ్ధిదారులకు అందిస్తున్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వంలో రేషన్ కార్డు, ఇళ్ల స్థలాలు వంటి ఏ పథకాలు కావాలన్నా మండల కేంద్రాలకు కాళ్లరిగేలా తిరిగే వాళ్లమని, వైఎస్సార్ సీపీ హయాంలో ఇంటికే ప్రభుత్వ సేవలు అందుతున్నాయని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు



గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు పొందాలంటే జన్మభూమి కమిటీ సభ్యుల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఏఒక్కరి చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా చేశారు. సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలను నేరుగా ఇంటి ముంగిటకే అందిస్తున్నారు.

– గుండ్ర వెంకటలక్ష్మి, యండపల్లి

గ్రామంలోనే సకల సేవలు



గతంలో ఏదైనా ధ్రువపత్రం పొందాలన్నా సరే మండల కేంద్రమైన కొత్తపల్లి వచ్చి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి గ్రామంలో సచివాలయాలు ఏర్పాటు చేయడం వల్ల గ్రామంలోనే సకల సేవలు అందుతున్నాయి. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి రుణపడి ఉంటాం.

– దాసరి అప్పలకొండ, యండపల్లి

జాతీయ అథ్లెటిక్స్‌లో నాగబాబు ప్రతిభ


యాతం నాగబాబును అభినందిస్తున్న కమిషనర్ రామారావు, ఎంపీడీఓ, తహసీల్దార్లు

సామర్లకోట: పట్టణానికి చెందిన యాతం నాగబాబు జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌లో విశేష ప్రతిభ కనబర్చారు. మహారాష్ట్రలోని ముంబై సౌమ్య విద్యా విహార్ స్పోర్ట్స్ స్టేడియంలో గత నెల 28న జరిగిన మాస్టర్ అథ్లెటిక్ పోటీల్లో నాగబాబు పాల్గొన్నారు. 800 మీటర్ల రన్నింగ్‌లో వెండి, 400 మీటర్ల రిలేలో బంగారు, 100 మీటర్ల రిలేలో బంగారు పతకాలను సాధించారు. 55 ఏళ్ల విభాగం పరుగు పందెంలో ప్రతిభ చూపిన నాగబాబును ఆదివారం సాయంత్రం మున్సిపల్ కమిషనర్ జె రామారావు స్వగృహంలో కమిషనర్, తహసీల్దార్ జె.శ్రీనివాసు, ఎంపీడీఓ ఎస్టీ శ్యామ్‌సుందర్ అభినందించారు. ఇప్పటి వరకు 66 పతకాలు సాధించి మాస్టర్ అథ్లెటిక్స్‌లో రికార్డు సృష్టించినట్టు వారు విలేకర్లకు తెలిపారు.

ఆదరించండి.. అభివృద్ధి చేస్తా


రాపర్తిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత
- అడుగడుగునా బ్రహ్మరథం పట్టిన ప్రజలు

పిఠాపురం: రానున్న ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసే అవకాశమివ్వాలని వైఎస్సార్ సీపీ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత అన్నారు. ఆదివారం ఆమె పిఠాపురం మండలం రాపర్తి, విరవలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. గడప గడపలో ఆమెకు మహిళలు ఘనంగా స్వాగతం పలికారు. అభిమానులు పూలు జల్లుతూ ఆమెకు బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత మాట్లాడుతూ అందరికీ అందుబాటులో ఉండే తనకు అవకాశం కల్పించాలని మీ ఇంటి మనిషిగా పిఠాపురం ప్రజల ఆడబడుచుగా అందరికీ సేవ చేసుకునే భాగ్యం కల్పించాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను ప్రజల ఇంటి ముంగిటకే చేరుస్తున్నారన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాల వల్ల నిరుపేదల జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయన్నారు. రాష్ట్రంలో కోట్లాది కుటుంబాలకు మేలు చేసిన జగనన్న ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. అవినీతికి తావు లేకుండా ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా అందజేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. సంక్షేమ పథకాలన్నీ కొనసాగాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలన్నారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో భారీగా చేరికలు


వైఎస్సార్ సీపీలో చేరిన వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న వంగా గీత

పిఠాపురం: నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత సమక్షంలో మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు పిట్టా వెంకట మాధురితో పాటు వివిధ పార్టీలకు చెందిన నాయకులు వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి ఎంపీ వంగా గీత వైఎస్సార్ సీపీ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి సాధ్యమన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రతిఒక్కరూ పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు పిట్టా వెంకట మాధురి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన, ఆయన అమలుచేసిన సంక్షేమ పథకాలు నచ్చి వైఎస్సార్ సీపీలో చేరానన్నారు. కార్యక్రమంలో ఉలవల భూషణం, పాపిరెడ్డి, రాయుడు చిన్న, కొంగు నూకరాజు, ఏలేటి విఘ్నేశ్వరరావు, రోశ్శ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

10న చందనోత్సవం

బోట్‌క్లబ్: గొడారిగుంట జర్నలిస్ట్ కాలనీలో ఉన్న రమా సహిత సత్యదేవ మందిరంలో అక్షయ తృతీయ సందర్భంగా ఈ నెల 10న చందనోత్సవం నిర్వహిస్తున్నట్టు మధ్వ పురోహితుడు యాతగిరి మద్వేష్ ఆదివారం విలేకర్లకు తెలిపారు. మందిరం స్థాపించి 27 ఏళ్లు పూర్తయిన సందర్భంగా వార్షికోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఏటా క్రమంతప్పకుండా గురువుల ఆరాధనలతో పాటు, విశేష కార్యక్రమాలు జరిపిస్తున్నామని తెలిపారు.

ముంచెత్తిన మంచినీటి చెరువు నీరు


కరప మార్కెట్ వద్ద రోడ్డుపై నిలిచిపోయిన నీరు

కరప: ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది నిర్లక్ష్యం వల్ల రక్షిత మంచినీటి చెరువు నిండిపోయి, పొర్లి ప్రవహించింది. దీంతో మార్కెట్ వద్ద, మండల కార్యాలయం ఆవరణలో నీరు నిలిచిపోయింది.. మండల కేంద్రమైన కరపలో సామూహిక రక్షిత మంచినీటి చెరువు నుంచి 8 గ్రామాలకు తాగు నీరు సరఫరా చేస్తారు. పెనుగుదురులోని కేఎంజే కెనాల్ నుంచి మోటార్లతో నీటిని తోడి, పైపులైన్ ద్వారా ఈ చెరువుకు మళ్లిస్తారు. రక్షిత మంచినీటి చెరువులోని నీటిని క్లోరినేషన్ చేసి, కరప, పేపకాయలపాలెం, వలసపాకల, వేములవాడ, కొరిపల్లి, జెడ్.భావారం, గొడ్డటిపాలెం, అరట్లకట్ట గ్రామాలకు రక్షిత మంచినీరు అందిస్తారు. ఆదివారం ఉదయం 5.30కు పెనుగుదురులో మోటార్ ఆన్ చేసి నీటిని తోడటం ప్రారంభించారు. చెరువు నిండాక మోటార్‌ను ఆపాల్సిన సిబ్బంది పట్టించుకోలేదు. దీంతో చెరువు నుంచి నీరు పొర్లి ప్రవహించింది. మార్కెట్ ఎదురుగా, మండల విద్యా వనరుల కేంద్రం వద్ద, మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మోకాలు లోతు నీరు నిలిచిపోయింది. వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు. సిరిగలపల్లి లంక ఎన్నికల ప్రచారం నుంచి తిరిగొస్తూ మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆగిన ఎమ్మెల్యే కన్నబాబు.. రోడ్డుపై నిలిచిపోయిన నీటిని పరిశీలించారు. వెంటనే అధికారులకు ఫోన్ చేసి చెప్పడంతో, సిబ్బంది మోటార్లను ఆపేశారు. చీకటి పడ్డాక నీరు తొలగిపోయింది.

బ్రాహ్మణ కుటుంబాలను ఆదుకుంటాం

- స్థానిక అభ్యర్థిని ఆశీర్వదించండి
- ఆత్మీయ కలయికలో మద్దతు కోరిన వైఎస్సార్ సీపీ అభ్యర్థి దవులూరి


మేడపాడులో ఎన్నికల ప్రచారం చేస్తున్న దొరబాబు, చంద్రకళ

సామర్లకోట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బ్రాహ్మణ కుటుంబాలను అన్ని రకాలుగా ఆదుకుంటారని వైఎస్సార్ సీపీ పెద్దాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు అన్నారు. స్థానిక బ్రాహ్మణ కుటుంబాల మద్దతు వైఎస్సార్ సీపీకి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఆదివారం స్థానిక బ్రాహ్మణ కమ్యూనిటీ హాల్‌లో మొక్కరాల సాయి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బ్రాహ్మణ సంఘ ప్రతినిధుల ఆత్మీయ కలయికలో దొరబాబు పాల్గొన్నారు. స్థానిక అభ్యర్థిగా, బ్రాహ్మణ అగ్రహారం సమీపంలోనే పుట్టి పెరగడం వల్ల వారి సమస్యలపై పూర్తి అవగాహన ఉందన్నారు. ఒక్కసారి తనకు అవకాశమిచ్చి ప్రతి ఒక్కరూ ఆశీర్వదించాలన్నారు. ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతోనే పార్టీ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, తాను రాజకీయాల్లోకి వచ్చామన్నారు. ఎంపీ అభ్యర్థి సునీల్‌కు కాకినాడ పార్లమెంటు నియోజకవర్గంపై పూర్తి అవగాహన ఉండటంతో, స్థానికంగా పరిశ్రమల ఏర్పాటుకు అవకాశం ఉందని చెప్పారు. తద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తారని తెలిపారు. పట్టణ బ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు అప్పల బ్రహ్మానందం, ఉపాధ్యక్షుడు వర్దిపాటి రామకృష్ణ, అప్పల శ్రీధర్, హనుమంతరావు, చీమలకొండ ప్రసాద్‌తో పాటు, 300 మంది బ్రాహ్మణులు దొరబాబుకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, పెద్దాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జి.కొత్తూరులో దొరబాబు భార్య ప్రచారం

స్థానికుడైన తన భర్త దవులూరి దొరబాబును ప్రతి ఒక్కరూ ఆశీర్వదించి, వైఎస్సార్ సీపీకి ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేయాలని ఆయన భార్య దవులూరి చంద్రకళ కోరారు. ఆదివారం గోలివారి కొత్తూరు గ్రామంలో సర్పంచ్ సత్యంశెట్టి మహాలక్ష్మి, ఉప సర్పంచ్ రాయి చిన్నవీర్రాజు, సత్యంశెట్టి రాంబాబు, బండారు సూరిబాబు, రాయి చంటిబాబు, వెలుగు వెంకటరమణతో కలిసి ఇంటింటా ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా చంద్రకళ మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యేతోనే నియోజకవర్గ అభివృద్ధి జరుగుతుందని చెప్పారు. ఒక్కసారి దొరబాబును ఎమ్మెల్యేగా గెలిపించి నియోజకవర్గ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ బాట వేయాలని పిలుపునిచ్చారు. ఎంపీ అభ్యర్థి సునీల్‌కు, ఎమ్మెల్యే అభ్యర్థి దొరబాబుకు ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేయాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజల కోసం సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేయడంతో ఆయనను ఓడించే ధైర్యం లేక, వేరే పార్టీలతో పొత్తు పెట్టుకుని చంద్రబాబు పోటీ చేస్తున్నారని తెలిపారు. అధికారం కోసం చంద్రబాబు ప్రజలను మభ్య పెట్టడానికి ప్రయత్నిస్తారని, ఓటర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఏమి చేస్తామో చెప్పాల్సిన ప్రతిపక్షాల నాయకులు, ప్రజలను రెచ్చగొట్టే ప్రసంగాలు చేయడం దారుణమన్నారు. ఇంటింటా దవులూరి చంద్రకళకు పూలు, హారతులతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో అయ్యారక కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ ఆవాల రాజేశ్వరి, కౌన్సిలర్లు పాలిక కుసుమ, రెడ్డి లోవకుమారి తదితరులు పాల్గొన్నారు.


బ్రాహ్మణ సంఘ నాయకులతో దవులూరి దొరబాబు

హోరెత్తిన దవులూరి ఎన్నికల ప్రచారం

సామర్లకోట: మండలంలోని మేడపాడు గ్రామంలో ఆదివారం సాయంత్రం వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి దవులూరి దొరబాబు ఎన్నికల ప్రచారం హోరెత్తింది. దొరబాబు, చంద్రకళ దంపతులు గ్రామంలోకి వచ్చిన వెంటనే వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా పరిషత్ అధ్యక్షుడు మోరంపూడి శ్రీరంగనాయకులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మోరంపూడి రమేష్ ఆధ్వర్యంలో భారీఎత్తున బాణసంచా కాల్పులు, గజమాలతో నాయకులు, అభిమానులు స్వాగతం పలికారు. స్థానిక నాయకునిగా ఒక్కసారి అవకాశం ఇవ్వాలనే నినాదంతో ఎన్నికల ప్రచారం సాగించారు. సర్పంచ్ పితాని దేవి, వెంకట్రావు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జగన్ అంటే ప్రజలకు నమ్మకం

కొత్తపల్లి: జగన్ అంటే రాష్ట్ర ప్రజలకు నమ్మకం–భరోసా అని, అవే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని అఖండ మెజార్టీతో గెలిపిస్తాయని మండల గ్రామ సచివాలయాల కన్వీనర్ అమ్మిడి జాన్ అన్నారు. మండలంలోని ఉప్పాడ ఎస్సీపేటలో ఆదివారం సచివాలయ కన్వీనర్ ఎస్.లోవలక్ష్మి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత, పార్టీ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌లను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు చొక్కా సింగన్న, ఎల్లాజీ, గెడ్డం సత్తిబాబు, గెడ్డం అమ్మోరియ్య, సీమంతుల రాణి, అరిగెల ఏసు తదితరులు పాల్గొన్నారు.

వాకతిప్పలో ఎన్నికల ప్రచారం


వాకతిప్పలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు


ఉప్పాడలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

కొత్తపల్లి: మండలంలోని వాకతిప్పలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి గీత, ఎంపీ అభ్యర్థి సునీల్‌లను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, సర్పంచ్ పాలాని దొరబాబు, గోపి హరిబాబు, దాకే రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభకు గీటు.. ఉపాధికి రూటు

- స్కిల్ హబ్‌తో నైపుణ్య శిక్షణ
- కాకినాడ అర్బన్‌కు జీపీటీ, రూరల్‌కు ప్రభుత్వ ఐటీఐ
- నైపుణ్యాలతోనే కొత్త అవకాశాలు
- 18 నెలల్లో 518 మందికి శిక్షణ
- ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు



జేఎన్‌టీయూకేలో స్కిల్ కళాశాల


శిక్షణ పొందుతున్న విద్యార్థులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): యువతలో నైపుణ్యం మరింత మెరుగుపరిచి, ఉపాధి అవకాశాలు అందింపుచ్చుకునేలా ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో స్కిల్‌హబ్‌కు 2022లో శ్రీకారం చుట్టారు. వాటిని నియోజకవర్గాల వారీగా నెలకొల్పారు. ఒక్కో కేంద్రానికి రూ.15 లక్షల విలువైన టెలివిజన్లు, సీసీ కెమెరాలు, ట్యాబ్‌లు, ల్యాప్‌టాప్‌లు సమకూర్చారు. ఆన్‌లైన్ ద్వారా

ఎంఎస్ ఆఫీస్–86, జావా, పైథాన్ బేసిక్స్, పైథాన్ ఫర్ డేటా సైన్స్, క్లౌడ్ కంప్యూటింగ్, క్లౌడ్ ఆర్కిటెక్ట్, డిజిటల్ మార్కెటింగ్, సైబర్ సెక్యూరిటీ, ట్యాలీ విత్ జీఎస్టీ, ఆండ్రాయిడ్ వంటి కోర్సుల్లో 15 నుంచి 45 రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. అనంతరం వీరికి పరీక్షలు నిర్వహించి, సర్టిఫికెట్లు అందజేయగా, దాదాపు రెండు వేల మంది సద్వినియోగం చేసుకున్నారు. జీపీటీలో జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, టైలరింగ్, కోర్సులపై శిక్షణ ఇవ్వగా, రూరల్‌కు సంబంధించి ప్రభుత్వ ఐటీఐలో సీఆర్‌ఎం డొమెస్టిక్ నాన్ వాయిస్, ఏసీ మెకానిక్ వంటి కోర్సులకు శిక్షణ ఇచ్చారు.

పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా..

జిల్లాలో పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ శ్రీకారం చుట్టింది..కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో హిటాచి వంటి కంపెనీలు విద్యార్థులకు షార్ట్‌టర్మ్ కోర్సులు నిర్వహించి, ఆసక్తి ఉన్నవారికి ఉద్యోగ అవకాశాలు కల్పించింది. అలాగే జిల్లాలో ఉన్న పలు ప్రైవేట్ సంస్థలు ఐటీఐ విద్యార్థులకు ప్రత్యేకించి శిక్షణ ఇవ్వడానికి ముందు కొచ్చాయి.

నియోజకవర్గం	కళాశాల	బ్యాచ్‌లు	శిక్షణ పొందిన విద్యార్థులు
కాకినాడ సిటీ	జీపీటీ కళాశాల	06	146
కాకినాడ రూరల్	ప్రభుత్వ ఐటీఐ	14	253
స్కిల్ కళాశాల	జేఎన్‌టీయూకే	04	118

యువతకు మంచి అవకాశం



పదో తరగతి నుంచి పీజీ పూర్తిచేసిన విద్యార్థులకు ఉద్యోగం కల్పించాలన్న ఆశయంతో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ పనిచేస్తోంది. జిల్లాకు చెందిన యువతీయువకులకు, మహిళలకు అనేక అంశాలపై శిక్షణ ఇస్తున్నాం. డిమాండ్ ఉన్న కోర్సుల్లో నైపుణ్యం పెంచి వారికి ఉపాధి అవకాశాల కల్పనకు కృషి చేస్తున్నాం. నియోజవకర్గానికి ఒక స్కిల్ హబ్‌లో భాగంగా కాకినాడ సిటీ, కాకినాడ రూరల్ నియోజవర్గాలకు సంబంధించి ఏర్పాటు చేశాం. బీటెక్ ఉత్తీర్ణులైన వారికి జేఎన్‌టీయూకేలో ఉచిత వసతి, శిక్షణ కల్పిస్తున్నాం.

– డి.హరిశేషు, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి, కాకినాడ